ప్రతిజీపీలో అంబేద్కర్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ప్రతిజీపీలో అంబేడ్కర్ జయంతిని అధికారికంగా ఘనంగా నిర్వహించాలని ఎంపీవో యాదగిరి అన్నారు. బుధువారం మండలంలోని ముప్పై గ్రామ పంచాయతీ కార్యాదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపివో యాదగిరి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహల వద్ద పరిసరాలను శుభ్రం చేసి విగ్రహన్ని శుభ్రం చేసి రంగులు వేయించాలని చెప్పారు. అదేవిధంగా డిఎస్ఆర్ అప్ డేషన్, శానిటేషన్, వైకుంట దామం, తాగునీటి వ్యవస్థను సక్రమంగా ఉపయోగించేవిధంగా చూడాలని, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు.

వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా వీరస్వామి



నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

జిల్లా వ్యవసాయశాఖ ఇన్‌చార్జి అధికారిగా వీరస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతవరకు పని చేసిన జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి సెలవుపై వెళ్లారు. మాల్ తుమ్మెద విత్తనక్షేత్రం ఏడిఎగా పనిచేసిన వీరస్వామికి జిల్లా ఇన్చార్జి వ్యవసాయ అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా వీరస్వామి బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, కార్యదర్శి బి. సాయిలు, ప్రతినిధులు సంతోష్ కుమార్, దేవరాజు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆసుపత్రులపై పట్టింపేది?



నగరంలోని ఓ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పేషెంట్ బంధువుల దుస్థితి

- ఇష్టారీతిన ఛార్జీలు
- గంటలకొద్దీ వెయిటింగ్
- కనీస సౌకర్యాలు నిల్
- పట్టించుకోని వైద్యశాఖ

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రయివేటు సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ కోల్పోతే ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు పడతారో జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు నిలువుటద్దంలా నిలుస్తున్నాయి. ఇష్టారీతిన ఛార్జీలు, ఇబ్బడిముబ్బడిగా ఫీజులు, లెక్కాపత్రం లేని టెస్టులు, ప్రత్యేకమైన మందులు ఇలా ఒకటేమిటి అన్నింటిల్లోనూ దోపిడీ మార్క్ కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఆ ఆసుపత్రులపై దృష్టి కూడా సారించడం లేదు. ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని బొంకడం, ఫిర్యాదులు వచ్చిన తరువాత మౌనం వహించడం ఆనవాయితీగా మారుతోంది. ఇదేంటి అంటే 'ఆ ప్రజాప్రతినిధుల నుంచి ప్రెషర్ ఉంది' అని అంటున్నారు. జిల్లాలో పేరుకే పెద్దపెద్ద ఆసుపత్రులు ఉన్నా కనీస వసతులు కరువవుతున్నాయి.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రయివేటు ఆసుపత్రులు దారుణ పరిస్థితుల్లో కొనసాగుతున్నాయి. చాలా ఆసుపత్రుల్లో కనీస వసతులు కరువయ్యాయి. ఇక వైద్యులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు ఉంటారో తెలీని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో రోగులకు, ఆసుపత్రి సిబ్బందికి నిత్యం వాగ్వాదాలు చోటుచేసుకుంటు న్నాయి. ముఖ్యంగా ఓపీ పేషేంట్లు గంటలకొద్దీ వెయిటింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా ఆసుపత్రులకు వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. పైగా ఇతర ఆసుపత్రికి వెళ్దామంటే ఫైల్ ఇవ్వకుండా 'డాక్టర్ వస్తున్నారు.. వస్తున్నారు' అంటూ ఇబ్బందుల పాల్జేస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యులు లేకున్నా ముందుగా రోగుల నుంచి ఓపీ ఛార్జీ కింద రూ.500 వసూలు చేస్తున్నారు. తరువాత డాక్టర్ వస్తున్నారని, ఓటీలో ఉన్నారని కబుర్లు చెబుతున్నారు. ఇక కొంతమంది జీజీహెచ్‌లో ఉన్న డాక్టర్లు తమ స్వంత క్లినిక్‌కు మధ్యాహ్నం వరకు రాలేని పరిస్థితి. కానీ అక్కడికి వచ్చిన రోగులను సైతం మరో ఆసుపత్రికి వెళ్లనీయకుండా డాక్టర్ వస్తున్నారంటూ వెయిటింగ్ చేయిస్తున్నారు. ఇక ఓపీ ఛార్జీలను ఇష్టారీతిన పెంచేశారు. గతంలో ఒకసారి ఓపీ తీసుకుంటే నెల రోజుల వరకు మళ్లీ రోగులకు ఉచితంగా డాక్టర్ అపాయింట్‌మెంట్ వచ్చేది. కానీ ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే మొదటి రోజు రూ.500 కట్టినా సరే మర్నాడు వస్తే మళ్లీ రూ.400 చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ అంశాలేవీ ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఒక డాక్టర్ రక్త లేదా ఇతర పరీక్షలు రాస్తే.. ఆ ఫలితాలు రావడానికి కనీసం ఒకట్రెండు రోజులైనా పడుతోంది. కానీ ఆ రిపోర్టులు చూయించాలని అనుకున్నా మళ్లీ ఓపీ ఫీజు కట్టాల్సి వస్తోంది.

ఇబ్బడిముబ్బడిగా టెస్టులు..

ప్రయివేటు ఆసుపత్రుల్లో మొదటి నుంచి టెస్టుల విషయంలో ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అవసరమైన టెస్టుల రాస్తే అందుకు ఎవరి నుంచి ఇబ్బంది ఉండదు. కానీ ఇబ్బడిముబ్బడిగా టెస్టులు రాస్తూ జేబుకు చిల్లు పెడుతున్నారు. అయితే డాక్టర్లు స్వతహాగా ల్యాబులు పెట్టిన నాటి నుంచి ఈ సమస్య తీవ్రమవుతోంది. ఇక ఆన్‌కాల్ డాక్టర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత వైద్యానికి ఆ ఆసుపత్రుల్లో వైద్యులు లేకున్నా సరే ఆన్‌కాల్ పేరిట రోగులను గంటలకొద్దీ వెయిటింగ్ చేయిస్తున్నారు. ఇక ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. చాలీచాలని మరుగుదొడ్లు, కనీసం కూర్చోడానికి సైతం కూర్చీలు ఉండటం లేదు. రోగులతో వచ్చిన అటెండర్లు నేలపైన కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని వైద్యశాఖ

ప్రయివేటు ఆసుపత్రుల్లో సౌకర్యాలపై, అక్కడ అందుతున్న వైద్యంపై నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన వైద్య ఆరోగ్యశాఖ తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఇప్పటి వరకు ఒక్క ఆసుపత్రుల్లో కూడా తనిఖీలు చేసిన పాపాన పోలేదు. ఫిర్యాదులు వచ్చినా సరే పట్టించుకోవడం లేదు. నిజామాబాద్ జిల్లాలో కొన్నేండ్లుగా కీలకమైన పోస్టుపై ఒకే అధికారి ఉండటంతో ప్రయివేటు ఆసుపత్రుల వ్యాపారం మూడు కాయలు ఆరు పువ్వులుగా సాగుతోంది.

దంచికొడుతున్న ఎండలు

- లక్మాపూర్, పాల్దాలో 44 డిగ్రీలతో రాష్ట్ర స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతగా నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎండకు జనసంచారం లేక బోసిపోయిన కంఠేశ్వర్ చౌరస్తా

నిజామాబాద్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. వారం రోజులుగా రోజురోజుకూ క్రమంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుతున్నాయి. జిల్లాలోని మాక్లూర్ మండలం లక్మాపూర్‌లో రాష్ట్ర స్థాయిలోనే అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం విశేషం. అదే విధంగా పాల్దాలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. జిల్లా వ్యాప్తంగా సగటు 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఉక్కపోతతో జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండలు మండుతుండటంతో మధ్యాహ్నం వేళ జనసంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పని ఉన్న వారు బయటకు వెళ్లినా.. ఎండ నుంచి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పండ్ల రసాలు, కూల్ డ్రింక్స్ తాగుతూ ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నిజామాబాద్ వాతావరణ శాఖ అధికారి ప్రతాప్ వెల్లడించారు.

గరిష్ఠ ఉష్ణోగ్రతలతో పాటు కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతుండటంతో ఇండ్లల్లో ఉక్కపోత పెరిగిపోయింది. వృద్ధులపై, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, ఎండలో బయటకు వెళ్లకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



గొడుగు ఉంటేనే అడుగు బయటకు..





జ్యూస్ సెంటర్‌లకు, తాటి ముంజలకు గిరాకీ

పశుమిత్రలను కార్మికులుగా గుర్తించాలి

- కనీస వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-గాంధారి



వినతిపత్రం అందజేస్తున్న పశుమిత్రలు

పశు మిత్రలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని పశు మిత్రలు డిమాండ్ చేశారు. పశుమిత్ర సంఘం మండల సంఘం ఆధ్వర్యంలో బుధ వారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తహసీల్దార్ గోవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పశుమిత్రల సంఘం మండల కార్యదర్శి రోజా మాట్లాడుతూ పశుమిత్రులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని పశుమిత్రులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని యూనిఫామ్ గ్లౌజులు మాస్కులు మందులతో ఉన్న కిట్టు ఇవ్వాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. పని భద్రత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పశు మిత్రలందరికీ సబ్సిడీపై ఎలక్ట్రానిక్ బైకులు ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షురాలు మాధవి అధ్యక్షురాలు శ్రీలత, కార్యదర్శి రోజా, సవిత, మండలంలోని పశుమిత్రలు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్ వర్సెస్ ఎంపీపీ

- సమావేశంలో ఇరువురి మధ్య వాగ్వివాదం



వాగ్వాదానికి దిగిన జడ్పీ చైర్మన్, ఎంపీపీ

నవతెలంగాణ-మాక్లూర్

ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు సమావేశంలో ఎంపీపీ మస్త ప్రభాకర్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సమావేశానికి ఇరువురు హాజరు కావాల్సి ఉండగా.. ముందుగా జిల్లా జెడ్పీ చైర్మన్ వచ్చి సమావేశాన్ని ప్రారంభించారు. కొద్ది సమయానికి ఎంపిపి వచ్చారు. 'నీవు ముందు రావాల్సి ఉండగా.. నేను వచ్చానని' జడ్పీ చైర్మన్ ఎంపీపీతో వాగ్వాదానికి దిగారు. సమావేశం సమాచారమే లేదని, మీ పీఏ ఫోన్ చేయడంతో వచ్చానని కనీస ప్రోటోకాల్ పాటించరా అని తనకు తెలియకుండా తన కార్యాలయంలో ఎన్నో సమావేశాలు నిర్వహిస్తున్నారని ఎంపీపీ మండిపడ్డారు. దీంతో సమావేశంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఇరువురు వాగ్వాదానికి దిగి అనంతరం వారికి వారే సముదాయించుకొని సమావేశం ప్రారంభించారు.

నూతనంగా మండల బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటుచేసి జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించడానికి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీలు బాలల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ క్రాంతి, జిల్లా శిశు సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారిణి సుధారాణి, సీడీపీఓ సౌందర్య, ఎంఇఓ రాజగంగారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డా.సరిత, గంగరమంద సర్పంచ్ గంగారం, అంగన్వాడీ కార్యకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టిఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేష్ దొత్రే ముఖ్య అతిథులుగా ముస్లిం ఉద్యోగులకు కలెక్టరేట్‌లో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.
-కామారెడ్డిటౌన్

రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడొద్దు

- నిర్దిష్ట ప్రణాళికతో సాఫీగా ధాన్యం సేకరణ చేపట్టాలి
- సన్నాహక సమావేశాల్లో కలెక్టర్‌లు



నిజామాబాద్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డిటౌన్

ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు గాను సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ఏ దశలోనూ రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో బుధవారం ఆయా శాఖల అధికారుల తో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలు, ఐకెపి సీసీలు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంట విక్రయం విషయంలో రైతు ఏ దశలోనూ ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు.

తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకుండా పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించా లని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వరికోత యంత్రాల ద్వారా ధాన్యం కోసే సమయంలోనే తప్ప, తాలు ఎగిరిపోయేలా నిర్ణీత వేగంతో ఫ్యాన్ పనిచేసేలా అవగాహన కల్పించాల న్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు కేంద్రాల్లో మంచినీరు, నీడ వంటి వసతులను అందు బాటులో ఉంచాలన్నారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.

ముఖ్యంగా ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చు కోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా అవసరమైన సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, కొను గోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. పై మూడు అంశాలపై దృష్టిని కేంద్రీకరిస్తే, ధాన్యం సేకరణలో చాలా వరకు సమస్యలు తెరమీదికి రావని, సజావుగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు.

రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు అవసరమైన గోడౌన్లు, స్థలాలను తక్షణమే సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్షాల వల్ల ధాన్యం పాడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపర్చే ప్రయత్నాలను ఎంతమాత్రం ఉపేక్షించ కూడదని, రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్ఓ చంద్రప్రకాశ్, డీసీఓ సింహాచలం, డీఏఓ తిరుమల ప్రసాద్, డీటీసీ వెంకటరమణ, డీఆర్డీఓ చందర్, మెప్మా పీ.డీ రాములు తదితరులు పాల్గొన్నారు.


ఈసారి అంచన 9 లక్షల మెట్రిక్ టన్నులు

గత ఏడాది ఇదే సీజన్‌లో 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈసారి సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సిన అవసరం ఉందని అంచనా వేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా నెలకొల్పనున్న 467 కేంద్రాల ద్వారా ప్రతిరోజూ సగటున 18 వేల నుండి 20 వేల మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం కొనుగోలు చేసినట్లయితేనే నిర్ణీత గడువులోపు నిర్దేశిత లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ చేపట్టగలుగుతామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.

గ్రేడ్ 'ఏ' ధర 2060

కామారెడ్డిటౌన్ : కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యమును రైతులు తీసుకువచ్చే విధంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, వ్యవసాయ అధికారులు చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యానికి రూ. 2060 బి , గ్రేడ్ ధాన్యానికి రూ.2040 ధర క్వింటాలుకు నిర్ణయించిందని తెలిపారు. కామారెడ్డి కలెక్టరేట్లో బుధవారం వ్యవసాయ అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. రైతులు దాన్యం కొనుగోలు కేంద్రానికి ఎండబెట్టిన ధాన్యం తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. తాలు, మట్టి పెల్లలు లేకుండా చూడాలని చెప్పారు.

మండుటెండల్లోనూ జలకళ



నిండుకుండలను తలపిస్తున్న మల్లన్న సాగర్



హెలిక్యాప్టర్ నుంచి ఫొటో తీస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-బాన్సువాడ

అపర భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టించారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పర్యటనకు వెళ్తూ ఏరియల్ వ్యూ ద్వారా కాళేశ్వరం జలాలతో నిండుకుండలా ఉన్న కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టును చూసి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి తమ ఫోన్‌లతో ఫోటోలు తీసుకున్నారు. మల్లన్నసాగర్ నిండుకుండను తలపిస్తుండటంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు సాగునీటికి డోకా ఉండబోదని స్పీకర్ తెలిపారు.

జాడలేని 'వన్ ధన్' స్కీం

- అటకెక్కిన..అటవీ ఉత్పత్తుల కొనుగోలు
- కష్టపడి సేకరించినా.. కొనేవారేరి?
- దళారుల చేతిలో మోసపోతున్న గిరిజనులు



లక్కను సేకరించి శుద్ధి చేస్తున్న గిరిజనులు, కూలీలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అటవీ ఉత్పత్తుల సేకరించి పొట్టు పోసుకునే జీవితాలు నేడు దుర్భరంగా మారాయి. అటవీ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయక చేతులెత్తేయడంతో అటవీ ఉత్పత్తుల సేకరణ తప్ప మరో పని తెలీని గిరిజనుల, కూలీల కుటుంబపోషణ భారంగా మారింది. సేకరించిన ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు సగానికి సగం ధరం చెల్లిస్తూ నిలువునా దోచుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వన్ ధన్ యోజన పథకం నీరుగారిపోయింది.

వివరాలు మెయిన్‌లో..

భర్తను హత్య చేసిన భార్య

- వివాహేతరబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి ఘాతుకం

నవతెలంగాణ-భిక్కనూర్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

వివాహే తర సంబంధా లు పచ్చని కాపురాల్లో చిచ్చులు పెడుతు న్నాయి. వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్న వారిని తొలగించుకునేం దుకు దారుణాలకు పాల్పడుతున్నారు. ఏకంగా హత్య చేస్తున్నారు. తాజాగా అలాంటి ఘటనే భిక్కనూర్ మండలంలోని జంగంపల్లిలో వెలుగుజూసింది. ఈ నెల 3వ తేదీనా బాబు మర్డర్ మిస్టరీని పోలీసులు చేధించారు. భార్యే తన భర్తను ప్రియుడితో కలసి హతమార్చి.. ఏమీ ఎరగనట్టు ఫిర్యాదు చేసింది. పోలీసులు తమ దైన శైలీలో విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగుజూసంది. ఘటనకు సంబంధించిన సీఐ తిరుపయ్య బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

జంగంపల్లికి చెందిన బందెల బాబు(36), లావణ్యకు సుమారు 16 ఏండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా ఎల్లారెడ్డికి చెందిన స్వామి వ్యవసాయ కూలీ పనులు చేపట్టేందుకు ఆరు నెలల క్రితం గ్రామానికి రాగా.. అతడితో లావణ్య వివాహేతర సంబంధం పెట్టుకుంది. వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను అడ్డు తొలగించాలనే ఉద్దేశ్యంతో ఆమె, ఆమె ప్రియుడు పన్నాగం పన్నారు. గత ఆదివారం రాత్రి బాబుకు మద్యం తాగించి అనంతరం వైర్‌తో స్వామితో కలిసి వైర్‌తో హత్య చేసినట్లు సీఐ తిరుపయ్య తెలిపారు. నిందితులను బుధవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టి రిమాండ్ కు తరలించారు. కేసును ఛేదించిన ఎస్సై ఆనంద్ గౌడ్ ను, కానిస్టేబుల్ వెంకటరాములు, రేణుక ని సీఐ అభినందించారు.

నేటి నుంచి పది ముల్యాంకనం

- నిర్మల హృదయ పాఠశాలలో ఏర్పాట్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం నేటి(13వ తేదీ) నుంచి చేపట్టనున్నారు. ఇందుకోసం నగరంలోని హమాల్‌వాడీలోగల నిర్మల్ హృదయ పబ్లిక్ స్కూల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. మూల్యాంకనానికి నియమించిన సిబ్బంది అందరూ నేడు(గురువారం) తప్పనిసరిగా ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. గైర్హాజరు అయిన వారిపై శాఖపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

సైనిక పాఠశాలకు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా డ్రీమ్ స్టడీ సర్కిల్ కోచింగ్ నుండి విద్యార్థి సైనిక పాఠశాలకు ఎంపిక అయినట్టు డైరెక్టర్ మహమ్మద్ అస్మత్ బుధవారం తెలిపారు. స్టేట్ సైనిక్ స్కూల్, రామంతపూర్‌లో 6 వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల అయినట్టు తెఇపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు 2023-24 గాను కోచింగ్ తీసుకున్న విద్యార్థి హర్షిత్ ఎంపిక అయినట్టు తెలిపారు సైనిక్ పాఠశాలలో ఎంపిక అయిన విద్యార్థిని అభినందించి శాలువతో సన్మానించారు. ఉన్నత చదువులు చదివి తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన కంటి వెలుగు ప్రోగ్రాం మండలంలోని చింతలూరు గ్రామంలో ఎంపీపీ కుంచల విమల రాజు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుకన్య ప్రసాద్, ఎంపీటీసీ జయ గిరిధర్, ఉప సర్పంచ్ జలంధర్, సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, డాక్టర్ అరవింద్ బృందం, సెక్రెటరీ రాకేష్, కో ఆప్షన్ అక్బర్ ఖాన్, వార్డు సభ్యులు, సిసి బాబు, సూపర్వైజర్ స్వరూప, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్ సుజాత, వివో ఏ లావణ్య, చిన్నారెడ్డి విడిసి సభ్యులు పాల్గొన్నారు

నువ్వక్కడే.. నేనిక్కడే



- ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలపై డోలాయమానం
- జూన్ రెండవ వారానికి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వాయిదా

నవతెలంగాణ-భీంగల్

ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులపై క్లారిటీ ఇవ్వకపోవడంతో 317 జీవో ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యా యుల (భార్య, భర్తలకు) నువ్వక్కడే, నేనిక్కడే అన్నట్లు అయ్యింది. పోయిన నెల మార్చిలో బదిలీలు చేపడుతున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేయగా హైకోర్టులో నాన్‌స్పౌజ్ యూనియన్ వారు కేసు దాఖలు చేయగా ఈ కేసును జూన్ 13 నాటికి వాయిదా వేసింది. దీంతో పదోన్నతులపై ప్రభుత్వం మరోసారీ గడువు పెంచడడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. ప్రభుత్వం చివరిసారిగా 2018లో పదోన్నతులు, బదిలీలు చేపట్టింది. ఇప్పటికి ఐదు సంవత్సరాలు అవుతుంది. ఇటీవల ప్రభుత్వం మరోసారి బదిలీలు చేపడుతున్నట్లు ఆదేశాలు జారీ చేయడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొంత ఉపశమనం కలిగింది. కానీ మంగళవారం కోర్టు ఉత్తర్వులతో వారి ఆశలకు గండి పడినట్లైంది.

317 జీవోలో వెళ్లి ఉపాధ్యాయుల నిరాశ...

ప్రభుత్వం కొత్త జిల్లాలకు సిబ్బంది సర్దుబాటులో భాగంగా 2021లో 317 జీవోలను ప్రవేశపెట్టడం వల్ల చాలా మంది ఉద్యోగ , ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు, జోన్లకు బదిలీలు కావడంతో కుటుంబాన్ని విడిచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. భార్యభర్తలు ఇద్దరు ఉద్యోగులు అయ్యింటే భార్య ఈ జీవో ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించడం వలన వారి పిల్లలు కూడ చదువులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇలా వెళ్లిన వారిలో మహిళ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవలే ప్రభుత్వం బదిలీలు చేపడుతున్నట్లు ప్రకటించడంతో కొంత సంతోషించారు. ఈ బదిలీల ద్వారానైన తన సొంత జిల్లాలకు, సొంతజోన్లకు వెళ్లవచ్చని భావించారు. కానీ వారి ఆనందానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి.

పదోన్నతులపై ప్రభుత్వానికి పట్టింపేది?

వివిధ శాఖలలో పనిచేస్తున్న సిబ్బంది పదోన్నతులపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇంచార్జీలతో కాలం వెల్లదీస్తున్నారు.

విద్యాశాఖలో పదోన్నతులు చేపట్టకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుందని చెప్పొచ్చు. వీటిని చేపట్టడం వల్ల పదోన్నతులతో పాటు కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టడం వల్ల సిబ్బంది కొరత కూడ తప్పుతుంది. అర్హత ఉండి కూడ కిందిస్థాయి ఉద్యోగం ఏళ్ల తరబడి చేయాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు తూచ్..

విద్యాశాఖ బదిలీల నిబంధనలు విస్మరిస్తుందనే చెప్పొచ్చు. ప్రతి విద్యా సంవత్సరానికి ముందే బదిలీలు, పదోన్నతుల చేపట్టాలి. ఇందుకు జిల్లా వ్యాప్తంగా ఖాళీలను గుర్తించి ఎక్కడ ఎంతమంది ఉద్యోగులను నియమించాలనే జాబితా ఆధారంగా ఉపాధ్యాయుల నుండి దరఖాస్తులు స్వీకరించి , పదోన్నతులు తర్వాత బదిలీలను చేపట్టి జూన్‌లో పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలి. కానీ ఏకోశాన ఇలాంటి చర్యలు చేపట్టకపోబడంతో ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేయాల్సివస్తుంది. పైగా లేని చోట సిబ్బంది కొరత కూడ ఉంటుంది. కావున ప్రతి సంవత్సరం బదిలీలు, పదోన్నతులు చేపట్టడం వల్ల విద్యవ్యవస్థ సాఫీగా సాగుతందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంబురాలు

నవతెలంగాణ-ధర్పల్లి

పంచాయతీ జూనియర్ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం నాలుగుసంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ కార్యదర్శులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం త్వరగా రెగ్యులర్ చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, ఎండిఓ నటరాజ్, మండలంలోని పంచాయతీ జూనియర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో తప్పిన ప్రాణాపాయం

తెగిన బాలుడి పాదం

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం బి గ్రామానికి చెందిన అద్నాన్ ధర్మారం బి గ్రామం నుంచి హైదరాబాద్ వెళ్లడానికి బాలుడు తల్లి నానమ్మతో కలిసి డిచ్ పల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అప్పటికే హైదరాబాద్ వెళ్లడానికి సిద్ధంగా ఉన్న రైలు బోగీలో ఎక్కి నానమ్మతో పాటు బాలుడు రైల్లో కూర్చున్నాడు. రైలు టికెట్ తీసుకొని రావడానికి తల్లి కౌంటర్ వద్దకు వెళుతుండగా బాలుడు ఒక్కసారిగా రైల్లోనుండి దిగబోయాడు. కాలు రైలు మధ్యలో ఇరుక్కు పోవడం అదేక్షణంలో రైలు ముందు కదలడంవల్ల బాలుడి ఎడమ కాలు పాదం భాగం తెగిపడిపోయింది. పక్కనే ఉన్న వారు గమనించి వెంటనే స్టేషన్ మాస్టర్ వద్దకు వెళ్లి సమాచారం అందించారు. కదులుతున్న రైలును వైర్లెస్ సెట్ ద్వారా ఆపారు. స్థానికులు తీవ్రగాయాలపాలైన బాలునికి బయటకు తీసి చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చిన్నారి తీవ్ర గాయాలతో బతికి బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు.

కంటి వెలుగు సిబ్బందికి సన్మానం



కంటివెలుగు సిబ్బందిని సన్మానించిన సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనా సముందర్ గ్రామంలో రెండవ విడత కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా పూర్తయినందుకు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కంటి వెలుగు వైద్య బృందం, సిబ్బందిని సర్పంచ్ ఇంద్రాల రూప రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. కంటి వెలుగు శిబిరంలో 2450 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. దగ్గర చూపు అద్దాలు అవసరమైన 184 మందికి అద్దాలను అందించారు. దూరం చూపువారిని 294 మందిని గుర్తించారు. వీరికి త్వరలోనే అద్దాలను అందిస్తామని తెలిపారు. మోతి బిందు కంటి ఆపరేషన్లు అవసరమైన 77 మందిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుప్రియ, డాక్టర్ వివేక్ మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరం విజయవంతం అయ్యేందుకు సహకరించిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరం వైద్యులను, సిబ్బందిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పేరం లింబాద్రి, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, హెల్త్ సూపర్వైజర్ సత్యనారాయణ, ఏఎన్ఎం అమృత, డిఇఓ రాము ఏషాల, దుర్గ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక శాస్త్ర పరిశోధనలో ప్రశ్నావళి కీలకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సామాజిక శాస్త్ర పరిశోధనలో ప్రశ్నావళి కీలక భూమిక పోషిస్తుందని డాక్టర్ రవీందర్ రెడ్డి ఆన్ సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ మూడో రోజు శిక్షణ కార్యక్రమంలో పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన రవీందర్ రెడ్డి పరిశోధనలో ప్రతి లక్ష్యానికి అనుగుణంగా ప్రశ్నావళి ప్రధానంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రశ్నావళి రకాలను వివరించి, మంచి ప్రశ్నావళి లక్ష్యాలను సమగ్రంగా వివరించారు. ప్రశ్నావళికి షెడ్యూల్‌కు ఉండే తేడాను పరిశోధక విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన మరో సెషన్‌లో డాక్టర్ జి శ్రీనివాసులు డాటా సోర్సెస్ ఇంక్లూడింగ్ ఈ రిసోర్స్‌పై పరిశోధకులకు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఆన్లైన్ ద్వారా సమాచారాన్ని ఎట్లా పొందాలని, దీన్ని పరిశోధనా పత్రంలో ఎలా అనువర్తింపచేయాలో తెలిపారు. ఇంటర్నెట్ టూల్స్ ద్వారా ప్రశ్నావళిని ఎలా రూపొందించాలని ప్రాక్టికల్ గా అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన మరో సెషన్‌లో డాక్టర్ టి సంపత్ రిసోర్స్ పర్సన్‌గా సామాజిక శాస్త్రాల పరిశోధనలో డాటా కలెక్షన్ ప్రాముఖ్యతను తెలిపారు. పరిశోధకులు అడిగిన బహుళ ప్రశ్నలకు సమాధానాలు వివరించారు. మూడో రోజు సెషన్లను కో-ఆర్డినేటర్ డాక్టర్ పున్నయ్య సమన్వయం చేశారు.

ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 16, 17,18 తేదీల్లో తిరుపతిలో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు, సహాయ కార్యదర్శి శివాజీ కార్మికులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని మామిడిపల్లిలో బుధవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం హరిస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి వేస్తూ, ఉద్యోగ ఉపాధి భద్రతకు ప్రమాదం కలిగిస్తూ దేశంలో ఆకలి సమస్యలు తీవ్రం చేస్తోందని తెలిపారు. కరోనాతో కార్మికులు కష్టాలు అనుభవించగా కార్పోరేట్ కంపెనీ అధినేతలు వేల కోట్ల రూపాయలు అక్రమ సంపాదన పెంచుకున్నారని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాచి, శ్రమదోపిడికి ఎగపడుతుందని , కార్మికులు ఎదుర్కొంటున్న ప్రమాదకర సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ఈ మహాసభల్లో రూపొందిస్తారని వారు తెలిపారు. సమావేశంలో ఐఎఫ్టియు నాయకులు. ఎస్ వెంకటేష్, గంగామణి, లక్ష్మి, లలిత,అనిత, మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు

జార్జిరెడ్డి వర్ధంతి వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

విప్లవ విద్యార్థి నాయకుడు, ఉస్మానియా అరుణతార, పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి 51 వ వర్ధంతి సభల సందర్భంగా బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, నిఖిల్ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యాసంస్కరణల పేరుతో జాతీయ నూతన విద్యా విధానం-2020 తీసుకొచ్చిందని తెలిపారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో దానిని రద్దు చేసే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యస్.దుర్గాప్రసాద్, ఏరియా ఉపాధ్యక్షులు నవీన్, నాయకులు వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామపంచాయతీ సపాయి కార్మికులకు బుధవారం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా పంచాయతీ వర్కర్ యూనియన్ అధ్యక్షుడు సుంకరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంకా కొన్నిచోట్ల సఫాయి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని అన్నారు. వారికి వెంటనే గుర్తింపు కార్డులు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నందిపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సపాయి కార్మికులకు గుర్తింపు కార్డులను సుంకరి శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో నందిపేట మండల కేంద్ర గ్రామపంచాయతీ సఫాయి కార్మికులు ఉన్నారు.

హలో బహుజన చలో నిజమాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో బుధవారం మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో హలో బహుజన చలో నిజామాబాద్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సుంకరి విజయ్ కుమార్ మాట్లాడుతూ నిజామాబాద్ బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16న జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని బహుజనులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, ఉపసర్పంచ్ పాలేపు చిన్న గంగారాం, ప్రధాన కార్యదర్శి సింగరి రాజేశ్వర్, దళిత ఐక్య సంఘటన భీంగల్ అధ్యక్షుడు ప్రసాద్, మండల నాయకులు లెక్చరర్ సాయన్న, కొంటికంటి నరేందర్, లక్ష్మణ్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆరతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీ లోని కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి ని బీసీ సెల్ డైరెక్టర్ గా నియమిస్తూ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ఆదేశాల మేరకు బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ డి రవీందర్, ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి కి నియామక పత్రం అందజేశారు. ప్రొఫెసర్ ఆరతి ఒక సంవత్సరం పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

తెలుగు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్ లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే తెలుగు అధ్యయన శాఖ, విభాగ సమావేశం - అధ్యాపకుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతుల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ డి రవీందర్ మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన తెలుగు అధ్యాపకులు పాల్గొనడం అభినందనీయమన్నారు. అధ్యాపకుల అభ్యర్థన మేరకు తెలుగు విభాగంలో ఇంటిగ్రేటెడ్ ఐదు సంవత్సరాల కోర్సుని యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌తోపాటు భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని వీసి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగానికి రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉందని తెలిపారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బోధన చేస్తున్న అధ్యాపకులు పిహెచ్‌డి పూర్తి చేస్తే అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని అన్నారు. టీయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ లావణ్య కేంద్ర సాహిత్య అకాడమీ మెంబర్‌గా ఎంపిక కావడంపై వీసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి, పీఠాధిపతి కలల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి కనకయ్య, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ బాల శ్రీనివాసమూర్తి, డాక్టర్ త్రివేణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్ లక్ష్మణ చక్రవర్తి, తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో జరిగిన చోరీ కేసులో ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన ఆలకుంట శ్రీనివాస్‌కు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ఏజేఎఫ్ సీఎం కోర్ట్, ఆర్మూర్ మేజిస్ట్రేట్ తీర్పు వెల్లడించినట్లు ఆయన వివరించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... గత సంవత్సరం జనవరి 23న మండలంలోని హాస కొత్తూర్ గ్రామానికి చెందిన కుమారి దాస రమ్యశ్రీ ఎవరో గుర్తు తెలియని దొంగలు తమ ఇంట్లో కి ప్రవేశించి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్టు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులుఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన ఆలకుంట శ్రీనివాస్ ను అరెస్టు చేశారు. ఆయన వద్ద నుండి దొంగిలించబడిన బంగారు ఆభరణాలను రికవరీ చేసి కోర్ట్ లో ఛార్జ్ షీట్ వేశారు. సాక్షులను విచారించినా ఏజేఎఫ్ సీఎం కోర్ట్, ఆర్మూర్ మేజిస్ట్రేట్ నిందితునికి సంవత్సరం సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. జరిమానా కట్టని యెడల మరో నెల రోజుల సాధారణ జైలు శిక్ష ఉంటుందని తీర్పులో వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు

రైతు కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని, ఇప్పటికైనా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. బుధవారం నగరంలోని నాందేవాడ సంఘం కార్యాలయం వద్ద ఏఐకేఎస్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పల్లపు వెంకటేష్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 1935 ఏప్రిల్ 11న అఖిలభారత కిషన్ సభ ఏఐకేఎస్ ఏర్పాటు చేశారన్నారు. దున్నేవాడికి భూమి కావాలని తెల్లదొరలకు వ్యతిరేకంగా ఈ సంఘం ఏర్పడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతులపై రుద్దాలని చూసిందన్నారు. రైతులు 13 నెలల పాటు నిర్వహించిన పోరాటంవల్ల ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఒకేసారి రైతు రుణమాఫీ లక్ష రూపాయలు చేయాలని, విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని, బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పి మద్దతు ధర గ్యారెంటీ చట్టం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు గోవుల సాయిలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట రాములు, రైతు సంఘం నాయకులు కిషన్, సురేష్, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోల ఎన్నికలు ఏకగ్రీవం

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎన్నికైన నూతన కార్యవర్గం

2023-2026 సంవత్సరానికి నిజామాబాద్ టీఎన్జీవోఎస్ జిల్లా ఎన్నికలకు ఆకుల ప్రసాద్ ఎన్నికల అధికారిగా, సహాయక ఎన్నికల అధికారులుగా జి.గురు చరణ్, ప్రమోద్ కుమార్ వ్యవహరించారు. అధ్యక్ష పదవికి మొదలుకొని అన్ని పదవుల గాను సింగిల్ సెట్ నామినేషన్ రావడంతో నామినేషన్ పర్వంలోనే అందరి విజయాలు ఖరారయినప్పటికీ ఎన్నికల అధికారి ఆకుల ప్రసాద్ బుధవారం రాతపూర్వకంగా విజయ పత్రాలను అభ్యర్థులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులుగా వరుసగా నాలుగోసారి అధ్యక్ష పీఠం వరించిన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్, జిల్లా కార్యదర్శిగా నేతికుంట శేఖర్ (వ్యవసాయ శాఖ), సహాధ్యక్షులుగా చిట్టి నారాయణ రెడ్డి , కోశాధికారిగా గంధం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల (రెవెన్యూ), పురుషోత్తం (ఆడిట్ శాఖ), బీఎల్ శంకర్ (విద్యాశాఖ), పి.నాగరాజు (వైద్యశాఖ), కేవీ.సునీత (మహిళ నీటిపారుదల), సంయుక్త కార్యదర్శిగా కే.నత్యం (వెల్ఫేర్), జాఫర్ హుస్సేన్, కాసాలి శ్రీనివాస్ (సర్వే శాఖ), అతిక అహ్మద్ (ఆర్ అండ్ బి), వసుమతి దేవి (సర్వే శాఖ) ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోల శ్రీనివాస్, మాణిక్యం, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మహేష్ కుమార్, నిరంజన్ గౌడ్, రవీందర్ సంజీవయ్య, ప్రకాష్, రాజేశ్వర్, ఆనంద్ బాబు, సాయిలు, ఆనంద్ కుమార్, నిరంజన్ గౌడ్, ఉమా కిరణ్, మహిళ కార్యవర్గ సభ్యురాలుగా మంజుల, విజయలక్ష్మి, ఇంద్ర, పారిజాతం, గీతారెడ్డి, సంధ్యారాణి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అలుక కిషన్ మాట్లాడుతూ.. తనను నాలుగోసారి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, ప్రతి ఒక్కరి సమస్యను ఏదీ ఉన్న ప్రభుత్వాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

- సామాజిక న్యాయం కోసం పోరాడుదాం
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- సామాజిక ఉద్యమ నిధి సేకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్



సంఘీభావ నిధి అందజేస్తున్న కార్మికులు

భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, సామాజిక న్యాయం కోసం పోరాడుదాం అని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో సామాజిక ఉద్యమ నిధి సేకరణ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, కుల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడే ప్రజా సంఘాలకు అండగా కార్మికవర్గం నిలవాలని, సంఘీభావ నిధిని సేకరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులంతా ఆర్థికంగా సహకరించాలని కోరారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై హింస పెరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని ప్రయత్నం చేస్తుందని, మతం పేరుతో, దేశ భక్తి ముసుగులో ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతుందని, దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు చేస్తుందని తెలిపారు. జాతీయ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా తన తాబేదారులకు కట్టబెడుతుందన్నారు. ప్రభుత్వరంగాన్ని మొత్తం ప్రైవేటుపరం చేయడం ద్వారా దళిత, గిరిజన, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు బిజెపి ప్రభుత్వం గండి కొడుతుందన్నారు. నూతన విద్యా విధానం పేరుతో మనువాద సిద్ధాంతాన్ని విద్యా విధానంలోకి చొప్పించి అమలు చేస్తుందని అన్నారు. కార్మిక సంఘాలు, కార్మిక హక్కులు, కార్మిక చట్టాలపై దాడులు చేస్తుందని, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మారి ్చవేస్తుందని తెలిపారు. రాజ్యాంగ రక్షణ, రిజర్వేషన్ల పరిరక్షణ, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడం. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, మత సామరస్యం, ఫెడరలిజం రక్షణ కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, ఫారుక్, కాలుజాన్, రాధిక, జరీనా, యాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలి

- పేపర్ లీకేజీలపైన సిట్టింగ్ జడ్జితో విచారణచేపట్టాలి
- విద్యార్థి, యువజన జేఏసీ సంఘాల డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలని, పేపర్ లీకేజీలపైన సిట్టింగ్ జడ్జితో విచారణచేపట్టాలని, విద్యార్థి, యువజన జేఏసీ సంఘాల డిమాండ్ చేశారు. విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు పీవైఎల్., పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బి.కిషన్, ఎం.నరేందర్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్, పీడీఎస్‌యూ యూనివర్సిటీ అధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ.. పేపర్ లీకేజీలపైన హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి, కారకులను కఠినంగా శిక్షించాలని, ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన అధికారులను తొలగించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి టీఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీ పరీక్షలన్నింటిపై సిట్టింగ్ జడ్జి చే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్‌సి బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని, పేపర్ లీకేజీ ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు అషుర్, ఎంఎస్ఎఫ్ఏఎస్ఏ నాయకులు సురేష్, రమణ, చక్రి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గొల్లడి తండాకు చెందిన ఆగ్రోత్ ప్రకాష్ తండ్రి మంగల్చంద్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును స్థానిక సర్పంచ్ ఆగ్రోత్ రవీందర్ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భరత్ నాయక్, వార్డు సభ్యుడు చందర్ సింగ్, తండావాసులు వసంతరావు, సవాయ్, రామ్, బలిరాం, హరిచంద్, తండా వసూలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రారం నర్సరీ పరిశీలన



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామ నర్సరీని డీఆర్‌డీఓ పీడీ సాయన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పల్లె ప్రకృతివనాన్ని, హరితహారం నర్సరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, కారోబార్, తదితరులున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, ఎంపీఓ ప్రకాష్, సక్కుభాయ్, కార్యదర్శి సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేరుతొలగించారనే ఫిర్యాదులు రావొద్దు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్
- కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్
- ఓటర్ల జాబితా నుండి తొలగించిన పేర్లను పున: పరిశీలించాలి : కలెక్టర్



విసిలో పాల్గొన్న కాలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఓటరు జాబితాలో తమ పేరును తొలగించారంటూ అర్హులైన ఏ ఒక్క ఓటరు నుండి కూడా ఫిర్యాదులు రాకుండా జాబితా పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. బుధవారం ఆయన ఎన్నికల జాబితా, బూత్ లెవెల్ అధికారుల నియామకం, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఇది ఎన్నికల ఏడాది అయినందున ఓటరు జాబితాను పున్హ పరిశీలించుకుని ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా చూడాలన్నారు. మృతి చెందిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించే విషయంలోనూ ఒకటికి రెండుసార్లు వివరాలను సరి చూసుకోవాలని హితవు పలికారు. తొలగించిన ప్రతి ఓటరు పేరుకు సంబంధించి స్పష్టమైన కారణాలు, ఆధారాలను పొందుపర్చాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ క్షేత్రస్థాయి పరిశీలన జరుపకుండా, రికార్డులను ధృవీకరించుకోకుండా జాబితా నుండి ఓటర్ల పేర్లు తొలగించకూడదని ఆదేశించారు. అర్హులైనప్పటికీ జాబితా నుండి తమ పేరు తొలగించారంటూ ఏ ఒక్కరు ఫిర్యాదు చేసినా, సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఓటర్ల జాబితా నుండి తొలగించిన పేర్లను పున్హ పరిశీలించాలి : కలెక్టర్

కాగా, వివిధ కారణాల వల్ల ఓటర్ల జాబితా నుండి తొలగించిన పేర్లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆర్డీఓలు, తహసీల్దార్లు, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 39 వేల పైచిలుకు మంది పేర్లు వివిధ కారణాలతో ఓటరు జాబితా నుండి తొలగించడం జరిగిందన్నారు. వీటిని పున్హపరిశీలించుకోవాలని, అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. పోలింగ్ స్టేషన్ వారీగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపాలని సూచించారు. ప్రభుత్వం నుండి వేతనం, గౌరవ వేతనం పొందుతున్న వారినే బూత్ లెవెల్ అధికారులుగా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీ ఆర్ డీ ఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్, ఆర్డీఓలు రవి, రాజేశ్వర్, శ్రీనివాసులు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు, సహాయ ఈ.ఆర్.ఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-మద్నూర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన కంచనవార్ ప్రవీణ్ (29) అనే వ్యక్తి మహారాష్ట్రలోని దెగ్లూర్‌లో నివాసముంటున్నాడు. కాగా మద్నూర్ మండల కేంద్రంలో వైన్స్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అయితే రోజు వారీగా పనులు ముగించుకొని మంగళవారం రాత్రి తన బైక్‌పై ఎన్‌హెచ్ 161 సర్వీస్ రోడ్డుపైన దెగ్లూర్ వైపు వెళ్తుండగా హండేకెలూర్ శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా ప్రమదవశాత్తు బైక్ అదుపు తప్పిందా? లేదా ఏదైనా వాహనం ఢీకొని మృతిచెందాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- వైఎస్ఆర్ టీపీ నియోజకవర్గ నాయకులు జామున రాథోడ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

టీఎస్‌పీఎస్‌సీని వెంటనే ప్రక్షాళన చేయాలని వైఎస్ఆర్‌టీపీ నాయకులు జామున రాథోడ్ డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జమున రాథోడ్ మాట్లాడుతూ.. నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలని 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఎస్‌సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, టీఎస్‌పీఎస్సీ లీకేజీ దోషులను శిక్షించాలని హాస్టల్లో రుచికరమైన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీలం రమేష్, నీలం భోగి సంజీవులు, మండల నాయకులు మధుసూదన్‌రెడ్డి, గడా రవి, సంతోష్, సుభాష్, తాహెర్, రాము, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ను సన్మానించిన అయ్యప్ప ఆలయ కమిటీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ పాత్రికేయులు జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన ఉక్కల్కర్ రాజేందర్‌నాథ్‌ను అయ్యప్ప ఆలయంలో కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేందర్ నాథ్‌ను ఆలయ కమిటీ చైర్మన్ పద్మ శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వ్యక్తి జాతీయస్థాయి జర్నలిస్ట్ యూనియన్‌లో కీలక పదవి పొందడం శుభ పరిణామమని వారు కొనియాడారు. రాజేంద్రనాథ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని 1993-94 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి అప్పటి గురువులు భూపాల్‌రెడ్డి, మురళీధర్ రావు విచ్చేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరుగుతూ జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సరస్వతి, కోమల, వసంత, చంద్రకళ, అరుణ, లక్ష్మి, అనసూయ, సుకన్య, బాలమణి, శోభ, శ్రీలత, సునీత, మంజుల, కవిత, చంద్రకళ, లత, మీనా, వసంత తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన సుర్బిర్యాల్ గ్రామస్తులు



ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలోని అభివృద్ధి పనులు, గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం వారు మినీ కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయాలనీ బుధవారం పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మిగిలిన కుల సంఘాల భవనాలకు కూడా నిధులు ఇస్తానని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చిట్టాపూర్ నుండి ఫతేపూర్, సుర్బిర్యాల్ కోమన్ పల్లి, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వరకు డబుల్ రోడ్డు , సుర్బిర్యాల్ నుండి జలాల్ పూర్ లింక్ రోడ్డు గురించి మళ్ళీ గుర్తుచేయగా సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి

- ప్రముఖ జనరల్ ఫిజీషియన్ చిటిమిల్ల సంతోష్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ చిట్టిమిల్ల సంతోష్ కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ యువ శక్తి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని బాలికల ఐటిఐ కళాశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిటిమిల్ల సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఏ ఒక్కరూ ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలని అన్నారు. అలాగే సీపీఆర్ గురించి తెలిపారు. కార్యక్రమంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మన్, ట్రైనింగ్ ఆఫీసర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, లైన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ యువ శక్తి కార్యదర్శి డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, కోశాధికారి సి.జగన్ మోహన్, సభ్యులు దారం గంగాధర్, సుభాష్, పద్మ నాగరాజు, కళాశాల స్టాఫ్ సంధీకర్, ఏటీవో అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొతంగల్ ఆసుపత్రిని పరిశీలించిన ప్రత్యేక బృందం



ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందం

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలోని పోతంగల్ ప్రాథమిక ఆసుపత్రిని రాష్ట్ర ప్రత్యేక బృందం బుధవారం పరిశీలించారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సిబ్బందికి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులపాటు ఆసుపత్రిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇప్పటివరకు సాధించిన ప్రగతి తదితర అంశాలపై కూలంకషంగా పరిశీలించారు. న్యాక్స్ అసైన్మెంట్ టీం బృంద సభ్యులు డా.గోవన్, డాక్టర్ మేరీ పరిశీలించారు. వారి వెంట జిల్లా వైద్యాధికారి సుదర్శన్, ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య, డాక్టర్ సుప్రియ, సూపర్వైజర్లు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రానికి చెందిన పద్మశాలి మేకల ప్రసాద్ గత పది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించడంతో వారి భార్య రజితకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వారి సహకారంతో స్థానిక నాయకులు రూ.పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సీనియర్ నాయకులు గాదారి అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, వీడీసీ అధ్యక్షులు కుమ్మరి రాజయ్య, కోఆప్షన్ మెంబర్ అల్తాఫ్, జనార్ధన్‌రెడ్డి, వార్డ్ మెంబర్లు పెసరి సాయిలు, బండి శీను, కుర్మ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు కాదు.. వీడ్కోలు సమావేశాలు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/(వేల్పూర్)ఆర్మూర్

బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నవి ఆత్మీయ సమ్మేళనాలు కాదు వీడ్కోలు సమావేశాలని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాగపూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మానాల మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

ఇన్ని రోజులు బీఆర్ఎస్ కార్యకర్తల మొఖం కూడా చూడని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను గమనించి ఎలాగైనా ప్రజలు వీడ్కోలు చెబుతారని వీడ్కోలు సమావేశాలు నిర్వహిస్తున్నారని అన్నారు. మరో పక్క పసుపు బోర్డు పేరుతో గెలిచిన ఎంపి అరవింద్ ఇప్పుడు పసుపునకు మద్దతు ధర లేకున్న పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, పసుపు బోర్డు ఏర్పాటు చేసి రూ.12 వేల మద్దతు ధరలతో కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎస్ యుఐ అధ్యక్షులు వేణు రాజు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి తక్కురి దేవేందర్, నాయకులు బుచ్చి మల్లయ్య బోనగిరి భాస్కర్, బద్దం తిరుపతిరెడ్డి, చింతకుంట శ్రీనివాస్, లింగారెడ్డి, మల్లయ్య, రాము, ప్రదీప్, శ్రీనివాస్, మహేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి: మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

(వేల్పూర్)ఆర్మూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని, పేదప్రజల ఎకౌంట్లో 15 లక్షల రూపాయలు వెయ్యలేదని అన్నారు.

పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచిందని, నిత్యావసర వస్తువులపై జీఎస్టి వేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్, ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వడం లేదని, కేవలం ఎమ్మెల్యేల కమిషన్ల కోసం దళిత బంధు అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏడాది లోపే రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు అందిస్తామని, రైతాంగానికి రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని, మహిళలకు 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, ఇంట్లో ఉన్న ఇద్దరు వృద్ధులకు కనీసం ఐదువేల రూపాయల పెన్షన్ అందిస్తామని మానాల మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దామోదర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రంగు అనిల్, రాజేందర్, రమణ, రాము, ప్రవీణ్, మోహన్, మనోహర్, మల్లేష్, మాణిక్యం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు అలుగు పునర్నిర్మాణానికి భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామంలోని కొత్తచెరువు అలుగు పునర్నిర్మాణానికి ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ బుధవారం భూమి పూజ చేశారు. కొత్త చెరువు అలుగు చెడిపోయి గత వర్షాకాలం బుంగపడడంతో చెరువు నీరంతా వృధాగా పోయింది. దీంతో సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి ఇరిగేషన్ ఈఈ, ఏఈలను పంపించి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. నెల రోజుల క్రితం రూ.6.5 లక్షల నిధులను మంత్రి మంజూరు చేయించారు. ఆ నిధులతో చేపట్టిన కొత్త చెరువు అలుగు పునర్నిర్మాణ పనులకు సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, ఎంపిపి లోలపు గౌతమి సుమన్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ రాజేశ్వర్ మాట్లాడుతూ కొత్తచెరువు అలుగు భారీ వర్షాలకు బుంగలు పడి నీరు వృధాగా పోతుందని మంత్రి ప్రశాంత్‌రెడ్డికి తెలుపగానే రూ.6.50లక్షలు మంజూరు చేయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తెడ్డు కిరీటి, నాయకులు లోలపు సుమన్, నోముల నరేందర్, గడ్డం శ్రీధర్, గ్రామ అభివృద్ధి కమిటీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సందుల గంగారం, దోర రమేష్, భూషణ్, దినేష్, గోపి, రాజన్న, చిరంజీవి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల కుంభకోణంలో దోషులను శిక్షించాలి

- వైయస్సార్ తెలంగాణ పార్టీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని, టీఎస్పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని పేపర్లు బయటకు రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ ఇంచార్జ్ బుస్సాపూర్ శంకర్ డిమాండ్ చేశారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైస్ షర్మిల ఆదేశాలమేరకు బుధవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుస్సాపూర్ శంకర్ మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో పోటీ పరీక్షలు రాయొద్దని విద్యార్థులను రెచ్చగొట్టి మోసం చేసిన ఘనత కేసీఆర్ దే అన్నారు.

ఇప్పుడు కేసీఆర్ హయాంలో పేపర్ల లీకులతో ఉద్యోగాలకు లాకులు పడ్డాయని అన్నారు. 10వ తరగతి పరీక్ష పేపర్ లీకేజ్‌పై 24 గంటల్లో స్పందించిన ప్రభుత్వం. టీఎస్‌పీఎస్సి పేపర్ లీక్‌లో ప్రభుత్వ కార్యాలయ హస్తం ఉందని అన్నారు. ఇలాంటి పాలకులను గద్దె దించడమే వైయస్సార్ తెలంగాణ పార్టీ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గౌతమ్ ప్రసాద్ , రూరల్ అసెంబ్లీ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, ఎస్‌టి విభాగం జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్, యువజన నాయకులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధి మైనార్టీ సదార్ కమిటీకి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించే రంజాన్ తోఫా (నూతన వస్త్రాల కిట్)ను ఎంపీపీ పాల్త్య విఠల్, మండలాధ్యక్షుడు పెరిక శ్రీనివాస్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ నెంబర్ మజీద్ చేతుల మీదుగా పేద ముస్లిం కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలను గౌరవిస్తూ బతుకమ్మ పండుగకు, క్రిస్మస్ వేడుకలకు, రంజాన్ వేడుకలకు పేద కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. పేద ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రజలందరూ ఆనందంగా పండుగను జరుపుకోవాలని అన్నారు. ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బావయ్య, ఆర్ఐ హన్మాండ్లు, మండల కో ఆప్షన్ నెంబర్ ముస్తఫా హుస్సేన్, నాయకులు ఖలీల్, మక్బుసూద్, మైషా గౌడ్, చించు సాయిలు, పీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనులు పరిశీలన

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని అభంగపట్నం గ్రామపంచాయతీలో పల్లె ప్రగతి పనులను జడ్పీ సీఈవో గోవింద్ బుధవారం పరిశీలించారు. పల్లె ప్రగతి ద్వారా జరుగుతున్న పనులతో పాటు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సాజిద్ అలీ, కార్యదర్శి రామాగౌడ్, తులసీరామ్ ఉన్నారు.